ఆట.. పతకాల వేట


విలువిద్యలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు


పిఠాపురంలో స్పోర్ట్స్ డే ఆకారాన్ని ప్రదర్శించిన బీఎంఆర్ పాఠశాల విద్యార్థినులు

- ప్రభుత్వ ప్రోత్సాహంతో క్రీడలకు పెరిగిన ఆదరణ
- పలు విభాగాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

పిఠాపురం: వివిధ క్రీడలతో పిఠాపురానికి అవినాభావ సంబంధం ఉంది. నాటి రోజుల్లో పిఠాపురం మహరాజా విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించారు. అర్ధ శతాబ్ద కాలంగా జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఈ ప్రాంత క్రీడాకారులు విజయ బావుటా ఎగురవేయడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం కూడా క్రీడలను ప్రోత్సహిస్తోంది. క్రీడా స్థలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంది. ఫలితంగా ఇక్కడ ప్రాక్టీస్ చేసిన క్రీడాకారులు విజేతలుగా నిలుస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందుతున్నారు. రగ్బీ, బాక్సింగ్, తైక్వాండో, బాస్కెట్ బాల్‌తో పాటు ప్రాచీన విద్యలైన విలు విద్య, కర్రసాము క్రీడల్లో నంబర్‌వన్‌గా నిలిచిన వైనాలెన్నో.

రెండు వేలకు పైగా క్రీడాకారులు

పిఠాపురం నియోజకవర్గంలో పలు క్రీడలకు సంబంధించి సుమారు 2 వేల మందికి పైగా క్రీడాకారులు ఉన్నారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పోర్ట్స్ డే ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు.



జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తాను

పిఠాపురం బాస్కెట్‌బాల్ క్రీడకు పెట్టింది పేరు. ఈ క్రీడలో రాణించాలని భావించి ఆట నేర్చుకున్నా. స్థానిక బాస్కెట్‌బాల్ క్రీడాకారులు, నా స్నేహితులు మంచి ప్రోత్సాహం ఇచ్చారు. దీంతో అతి తక్కువ కాలంలోనే ఆటలో మెళకువలు నేర్చుకున్నా. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాకు మంచి ప్రోత్సాహం ఇచ్చారు. దివ్యాంగుడిని కావడంతో మామూలు ఆటలో నున్న ఆడనివ్వరు. అందుకే దివ్యాంగుల క్రీడల్లో పాల్గొంటున్నాను. ఇటీవల బెంగళూరులో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా శిక్షణకు ఎంపికయ్యాను. మంచి శిక్షణ పొంది జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు జాతీయ స్థాయి క్రీడాకారుడిగా పిఠాపురానికి గుర్తింపు తేవడమే ధ్యేయంగా పెట్టుకున్నాను.

– ఉమ్మిడి ఏసు కుమార్, దివ్యాంగ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, పిఠాపురం

ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు



విలు విద్య పట్ల చాలా మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా క్రీడాకారుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే ధ్యేయంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కల్పించడంతో చాలా మంది ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. దీంతో ఎక్కువ మంది ఈ క్రీడలో శిక్షణ పొందడానికి ఆసక్తి చూపుతున్నారు.

– పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్, పిఠాపురం

ఆర్చరీలో శిక్షణ పొందుతున్నాను



నా పేరు ఎస్.కృష్ణఅభిరామ్. మాది పిఠాపురం. నేను 3వ తరగతి చదువుకుంటున్నాను. నాకు బాణాలంటే చాలా ఇష్టం. అది చూసి నా తల్లిదండ్రులు విలు విద్య నేర్పించారు. కాకినాడ జిల్లా సర్పవరంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో రజిత పతకం సాధించాను. జాతీయ స్థాయిలో రాణించాలన్న సంకల్పంతో శిక్షణ పొందుతున్నాను.

– ఎస్.కృష్ణ అభిరామ్, విలువిద్య క్రీడాకారుడు

క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయానికి శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో అర్చకులు వేమూరి సోమేశ్వర శర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ తొలి పూజ చేశారు. భక్తులకు దేవస్థానం తరపున అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు.

ఎస్సై బాషాకు సత్కారం


ఎస్సై బాషాను సత్కరించిన మసీద్ కమిటీ సభ్యులు

సామర్లకోట: స్థానిక పెన్షన్‌లైన్‌కు చెందిన మొహమ్మద్ హబీబ్ బాషాకు ఎస్సైగా పదోన్నతి లభించడంతో సోమవారం స్థానిక నూరానీ జామియా మసీద్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన రాజమహేంద్రవరం, మచిలీపట్నం, ఇబ్రహీమ్‌పట్నం, రెడ్డిగూడెం, జి.కొండూరు పోలీసు స్టేషన్లలో హెచ్‌సీగాను, ఏఎస్సైగా విధులు నిర్వహించారు. ఇటీవల ఎస్సైగా పదోన్నతి కల్పించి ఏలూరులో పోస్టింగ్ ఇచ్చారు. దాంతో కుటుంబ సభ్యులను కలవడానికి వచ్చిన బాషాను మసీద్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, కార్యదర్శి సైపుల్లా, కమిటీ సభ్యులు జిలాని, అమీర్, ఖాజా తదితరులు బాషాను సత్కరించారు.

డివిజన్ స్థాయి స్పందనకు 14 అర్జీలు


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతివారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందనలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 14 అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టణంలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని, పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ తగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి న్యాయం చేయాలని తదితర సమస్యలపై 14 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం


పిఠాపురంలో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

పిఠాపురం: స్థానిక పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ పి.వెంకటయ్య, సూపరింటెండెంట్ రామచంద్రరావు, ఆలయ అధికారి ఎం.సందీప్, అర్చకులు పి.రామకృష్ణాచార్యులు, పి.నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పరిశీలన


జగనన్న కాలనీ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: స్థానిక ఈటీసీ లే అవుట్ జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా షేర్ వాల్ టెక్నాలజీలో నిర్మితమవుతున్న ఇళ్లను చంద్రశేఖరరెడ్డి పరిశీలించి దానికి అవుతున్న ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.8 లక్షలు, లబ్ధిదారులు సమకూర్చిన రూ.35 వేలతో కలిసి ఇళ్ల నిర్మాణం జరుగుతుందని కాంట్రాక్టర్ చంద్రశేఖరరెడ్డికి వివరించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేసుకున్న వారి నుంచి కాలనీలో మౌలిక వసతులపై ఆరా తీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, కాకినాడ సిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర ప్రసన్న, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, హౌసింగ్ డీఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

స్థానిక ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టరు కృతికా శుక్లా సోమవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఇన్‌చార్జి డీఈ రాజ్‌కుమార్ ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న స్థలాలల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కాలనీకి వచ్చే సమయంలో ఖాళీ స్థలాలు ఉండటానికి వీల్లేదన్నారు. అనంతరం జగనన్న కాలనీలో పనులను పరిశీలించారు. హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌డీఓలు పి. నారాయణమూర్తి, కె.ప్రసాదరావు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: వచ్చే నెలలో సామర్లకోట సీబీఎం కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని గుడివాడ, సిరివాడ, కాండ్రకోట గ్రామాల్లో సోమవారం ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులతో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజాలతో కలిసి సమావేశమయ్యారు. గుడివాడలో సర్పంచ్ కనపర్తి సీమదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ వచ్చే నెల 12న లేదా 15న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట రానున్నారన్నారు. ఈటీసీ లే అవుట్‌లో నిర్మించిన జగనన్న కాలనీ ప్రారంభం, 36 అడుగుల వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం అక్కడ నుంచి సీబీఎం కళాశాల క్రీడా మైదానానికి చేరుకుని భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలంతా హాజరై విజయవంతం చేయాలని దొరబాబు కోరారు. ఎంపీడీఓ బత్తిన ఆశోక్‌కుమార్, జోకా నానాజీ, పల్ల గంగారావు, కామన రామకృష్ణ, మద్దూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు


ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో భాగంగా సోమవారం 1, 2 వార్డు పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణ బాపూజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళితో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి


సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

సామర్లకోట: సచివాలయాల్లో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సీనియర్ కౌన్సిలర్లు నేతల హరిబాబు, పితాని కృష్ణ మాట్లాడుతూ విధులకు హాజరు కానివారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ సబ్సిడీపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసిన, అర్హులందరికీ సబ్సిడీ వర్తిసుందని చెప్పినప్పటికీ అమలు కావడం లేదని హరిబాబు అన్నారు. దీనిపై తగు సూచనలు ఇస్తామని కమిషనర్ జె.రామారావు హామీ ఇచ్చారు. జగ్గమ్మగారిపేటలోని ఎలిమెంటరీ పాఠశాల విషయమై పితాని కృష్ణ ప్రస్తావించగా కలెక్టర్ ద్వారా విద్యాశాఖకు పంపినట్టు కమిషనర్ తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సూచించారు. ప్రధాన డ్రైనుపై నిర్మించిన కల్వర్టు రైలింగ్ పూర్తిచేయాలని కృష్ణ సూచించారు. మూడు వార్డులకు చెందిన రోడ్డు సమస్యను పరిష్కరించాలని కరణం రాజ్‌కుమార్ అన్నారు. అనంతరం అజెండా లోని అంశాలను ఆమోదించారు. ప్రత్యేక సమావేశంలో జగనన్న కాలనీలో తుప్పలు తొలగించడానికి ఎక్కువగా అంచనా వేశారని ఆవాల లక్ష్మీనారాయణ ఆరోపించారు. జేసీబీ పని గంటల ప్రకారం బిల్లు చెల్లిస్తామని కమిషనర్ తెలిపారు. నీలమ్మ చెరువు అభివృద్ధికి సంబంధించి అంచనాలు తయారు చేసి ఆ చెరువు పనులు పూర్తి చేయడం ద్వారా ప్రస్తుత కౌన్సిల్‌లో పట్టణానికి ఒక ఆస్తి ఏర్పడుతుందని ఆవాల అన్నారు. దానికి వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్‌తో పాటు సభ్యులు ఆమోదించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ సూచించారు. రుణమేళా కార్యక్రమంలో భాగంగా ఇసుకపల్లి, రమణక్కపేట, పొన్నాడ, మూలపేట గ్రామాల్లోని పాడిరైతులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాలు పోసే రైతులకు రూ.30 వేల చొప్పున దాణా కొనుగోలు, షెడ్లు వేసుకునేందుకు జిల్లా సహకార బ్యాంకు ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో పాడి రైతులకు రుణాలపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పాడి రైతులు పాల వెల్లువ కేంద్రాలను ఉపయోగించుకుని రుణాలను పొందాలని సూచించారు. మంగళవారం గోర్స, కొమరగిరి, ఎండపల్లి, కొండెవరం, బుధవారం అమీనాబాదు, కొత్తపల్లి గ్రామాల్లో రైతులకు రుణాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏపీఎం సఖీనాప్రియ, సహకార బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక

పిఠాపురం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కాకినాడ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో జరిగింది. పిఠాపురంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న కాకినాడ జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎ. అశోక్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.వరహాలు, ఎ.గంగా సూరిబాబు, ఉపాధ్యక్షులుగా జి.శ్రీకాంత్, కృప, సహాయ కార్యదర్శులుగా వాసు, మణికంఠ, కమిటీ సభ్యులుగా రాము, మణికంఠ, లోవరాజు, సిద్ధు, వెంకటేష్, చిన్ని, శివ, గోపాల్, అరుణ్, సంజయ్, సాహిత్, శైలులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దొరబాబు

సామర్లకోట: స్థానిక రాజీవ్ గృహకల్ప సమీపంలోని బాధిత కుటుంబానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రభుత్వ ఖాళీ స్థలంలో పాక వేసుకొని జీవిస్తున్న ముప్పిడి జ్యోతి, జాన్‌విల్సన్‌ల ఇల్లు కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న దొరబాబు ఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి కారణం అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చేస్తానని చెప్పి తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేసి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, వార్డు కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, పితాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పిఠాపురం: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. పిఠాపురం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలంటూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై దాడిని ఖండించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, మరో న్యాయవాది కిరణ్‌పై అక్రమంగా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ పిఠాపురం యూనిట్ ప్రధాన కార్యదర్శి జీఎస్ భాస్కరాచార్యులు కోరారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎస్ఎం ఆలీ, కొంజర్ల అప్పారావు, కాళ్ల విజయ్‌కుమార్, ముమ్మిడి శ్రీనివాసరావు, గౌతు రాజా, వేళంగి వెంకటేష్, అప్పారావు, జీవీవీ సత్యనారాయణ, మహిళా న్యాయవాదులు ఎం సత్యవతి, వాణి, రమణి తదితరులు పాల్గొన్నారు.

ముసలమ్మ తల్లి సంబరం


ఆకట్టుకున్న శక్తి వేషాలు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు ముసలమ్మ తల్లి సంబరం సోమవారం అంబరాన్నంటింది. వేకువ జామునుంచి పూజలు నిర్వహించి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరానికి పులిమేరు, గోరింట, గుడివాడ, దివిలి, చంద్రమాంపల్లి, చదలాడ, ఉలిమేశ్వరం గ్రామాలతో పాటు, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవతా మూర్తుల బళ్లవేషాలు, గరగలాట, బ్యాండ్ మేళం ఆకట్టుకున్నాయి.

జాతీయ క్రీడా దినోత్సవానికి ఏర్పాట్లు



వాకతిప్ప హైస్కూల్‌లో గోడలకు వేసిన పెయింటింగ్స్

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాల గోడలను పలు క్రీడలు, యోగాసనాలకు సంబంధించిన పెయింటింగ్స్‌తో ఆకర్షించేలా తీర్చిదిద్దారు. కాకినాడకు చెందిన తలాటం హరిష్ ఆర్థిక సహకారంతో పెయింటింగ్ వేయించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కనపర్తి నూకరాజు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలో రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన వారిని సత్కరిస్తామని చెప్పారు.

తెలుగు భాషకు వెలుగు గిడుగు

సాహితీవేత్త రెంటాల


గిడుగు రామ్మూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెంటాల తదితరులు

పెద్దాపురం: తెలుగు భాషకు వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని ప్రముఖ సాహితీవేత్త, కవి, గజల్ రచయిత రెంటాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో సోమవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెంటాల మాట్లాడుతూ తెలుగు భాషకు ఔన్నత్యాన్ని తీసుకురావడంలో గిడుగు చేసిన కృషి ఎనలేనిదన్నారు. పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ నేటి తరం పిల్లలు తెలుగు మరచిపోతున్నారని, తల్లిదండ్రులు వారికి ఇంట్లో తెలుగు భాష నేర్పించాలన్నారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన గిడుగు రామ్మూర్తి ఏకపాత్రాభినయం, తెలుగు గీతాలు, పోతన భాగవత పద్యాలు, పద్యపఠనం, శ్రీశ్రీ ఖండిక ఆహూతులను ఆకట్టుకున్నాయి. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, అకడమిక్ కో–ఆర్డినేటర్లు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళి

పెద్దాపురం: విద్యుత్ పోరాట అమరవీరుల పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక నువ్వుల గుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ప్రజలపై భారాలు వేస్తే తిరుగుబాటు తప్పదని నాటి నాయకులు నిరూపించారన్నారు. 2000 ఆగస్టు 28న జరిగిన పోరాటంలో టీడీపీ ప్రభుత్వం రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలను పొట్టన పెట్టుకుందన్నారు. నాటి పోరాటం వల్ల తొమ్మిదేళ్ల పాటు అప్పటి ప్రభుత్వాన్ని ప్రజలు దూరంగా ఉంచారన్నారు. అనంతరం విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

ఈటీసీలో చెట్లు కొట్టుకువెళ్లండి

సామిల్లర్లకు ఆర్డీఓ సూచన


సామిల్లుల యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలోని కర్ర కోత మిల్లర్ల (సామిలర్లతో)తో ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, సోమవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సమీక్షించారు. ఈటీసీ పరిధిలో కోత మిల్లులకు పనికివచ్చే అనేక రకాల చెట్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి కొట్టుకుపోవాలని ఆర్డీఓ సూచించారు. రూ.10 లక్షలు చెల్లిస్తే చెట్లను తొలగించి తీసుకు పోవడానికి అనుమతి ఇస్తామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఆర్వో పూడి రవిబాబు, ఏఈ కుమార్, సామిల్లుల యజమానులు పాల్గొన్నారు.